

## బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

జూలపల్లి: పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి సన్నిధిలో ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు.



## మంచి ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి

కోల్‌సిటీ : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంకు సాధించేలా పౌర స్పందనపై మంచి ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని కమిషనర్ (ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ మెప్మా ఆర్పీలను కోరారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0/25.0

## వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండగా, అసౌకర్యంగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### శివలింగంపై సూర్యకిరణాలు



శివలింగంపై పడుతున్న సూర్య కిరణాలు

రామగుండం: అంతర్గాం మండలం రాయదండి శ్రీచిలుకల రామేశ్వరాలయంలో సోమవారం శివలింగంపై నేరుగా సూర్య కిరణాలు పడ్డాయి. దీంతో భక్తులు దివ్య దర్శనం చేసుకున్నారు. శివుడికి ప్రత్యేక దినమైన సోమవారం కావడంతో శివ లింగంపై సూర్య తిలకం దిద్దుతున్నట్లు భావించి పూజలు చేశారు.

### వ్యాధులను దూరం చేద్దాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న

పెద్దపల్లిరూరల్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేసి ఆరోగ్యంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అన్న ప్రసన్నకుమారి అన్నారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా తన కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాతా, శిశువులు ఆరోగ్యంగా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. మహిళల్లో వ్యాధులను గుర్తించి నయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రధానంగా రక్తహీనత నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

### రోజూ వ్యాయామం చేయండి




ర్యాలీలో ఈడీ చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్(రామగుండం): ప్రతీరోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పర్మినెంట్ టౌన్‌షిప్‌లో సోమవారం చేపట్టిన మార్నింగ్‌వాక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ధన్వంతరీ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబాల శ్రేయస్సు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. జనరల్ మేనేజర్లు, విభాగాధిపతులు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లహిరి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### స్వల్పంగా పెరిగిన పత్తి ధర

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,311 ధర పలికింది. కనిష్ఠంగా రూ.5,208, సగటు రూ.7,008 ధర నిర్ణయించినట్లు మార్కెట్ కార్యదర్శి మనోహర్ తెలిపారు. పలువురు రైతుల నుంచి 183 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా

పెద్దపల్లిరూరల్: వేసవి దృష్ట్యా పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ మాధవరావు సూచించారు. జిల్లాలోని డీఈ, ఏడీఈ, ఏఈఈలతోపాటు అన్ని విభాగాల అధికారులతో సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన సమావేశమయ్యారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ వసూళ్లలో కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్లలో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు సహకరించిన అధికారులందరినీ ఆయన అభినందించారు.

### ప్రతీ సమస్యను పరిష్కరించుకుందాం

గోదావరిఖని: అధికార పార్టీ, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతీ సమస్యను పరిష్కరించుకుందామని ఐఎన్టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఓసీపీ–3 ఎస్‌అండ్‌డీ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులో బొగ్గు ఉత్పత్తి సాధనకు గుండెకాయ ఎస్‌అండ్‌డీ సెక్షన్ అని అన్నారు. నాయకులు రవీందర్‌రెడ్డి, కొంగర రవీందర్, అక్రమ్, కొత్త సత్యనారాయణరెడ్డి, దశరథంగౌడ్, ఐరెడ్డి సంపత్‌రెడ్డి, సాలిగామ మల్లేశ్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్‌అండ్‌డీ హెచ్‌వోడీ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు.

# ముంచుకొస్తున్న ముప్పు

- జిల్లావ్యాప్తంగా వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం
- నీరు అందక ఎండిపోతున్న పంటలు
- పొదుపుగా వినియోగించాలంటున్న అధికార యంత్రాంగం



ఇది అడుగంటిన వ్యవసాయ బావి. ధర్మారం మండలం కొత్తపల్లి శివారులోనిది. వ్యవసాయ బావుల ఆధారంగా దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో వరి, తదితర పంటలు పండిస్తున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బావుల్లో నీటి నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయి. పూడిక తీసేందుకు క్రేన్లు, ఇతర యంత్రాలు వినియోగిస్తూ రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. మరికొందరు బోరుబావులు వేస్తూ చివరి ప్రయత్నంగా పంటలు కాపాడుకోవడానికి తాపత్రయపడుతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: వేసవి ఆరంభానికి ముందునుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు సెల్సియస్‌కు చేరుకుంటున్నాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంతేకాదు.. ఎండల తీవ్రతతో భూగర్భ జలమట్టం అత్యంత వేగంగా పడిపోతోంది. ఈ ఏడాది ప్రారంభం, ప్రస్తుత పరిస్థితులకు పోల్చితే సుమారు మీటరు నుంచి మీటరున్నర లోతుకు నీటిమట్టం పడిపోయిందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పనిచేయడంలేదు. మరోవైపు.. ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు సాగు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురిస్తోంది.

**ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత..**

సాధారణంగా మార్చి నుంచి జూన్ వరకు వేసవి ఉంటుంది. కానీ, మార్చి కన్నా ముందుగానే.. అంటే.. ఫిబ్రవరి చివరివారం నుంచే ఎండలు భగ్గుమంటున్నాయి. బయటికి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సి వస్తోంది. రాత్రివేళల్లో ఉక్కపోత కూడా ప్రారంభమైంది. ఇలాంటి పరిస్థితుల్లో భూమిలో నుంచి వేడి వెలువడి మనుషులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. భూగర్భ జలమట్టం పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు వట్టిపోయాయి. పంట పొలాలు బీళ్లువారుతున్నాయి. బోర్లపైనే ఆధారపడి పంటలు పండిస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పొట్ట దశలోని పంటలను కాపాడుకోవడానికి రూ.లక్షల్లో అదనంగా ఖర్చుచేసి బోర్ల తవ్వకం చేపట్టినా ఫలితం అంతంత మాత్రంగానే ఉంటోంది.

**వ్యవసాయానికే అధికంగా వినియోగం..**

జిల్లా వ్యాప్తంగా 2024లో భూగర్భ జలాలపై అంచనా వేయగా.. 44,754 హెక్టా మీటర్ల పరిధిలో నీళ్లు ఉన్నట్లు తేలింది. ఇందులో 17,608 హెక్టా మీటర్ల భూగర్భ జాలలను సాగుకు వినియోగిస్తుండగా.. పరిశ్రమలు, గృహావసరాలు, తాగునీటి అవసరాల కోసం మరో 2,702 హెక్టా మీటర్ల నీటిని ఉపయోగించుకుంటున్నారని తేల్చారు. మొత్తంగా 45.38 శాతంతో 20,310 హెక్టా మీటర్ల నీటిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు వినియోగిస్తున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు.

**జిల్లాలో భూగర్భ జలమట్టం(మీటర్లలో)**

| ఏడాది | 2024 | 2025 |
|---|---|---|
| జనవరి | 4.95 | 4.95 |
| ఫిబ్రవరి | 5.09 | 5.44 |
| మార్చి | 5.58 | 5.70 |

**పొదుపుగా వాడాలి**

ప్రస్తుతం వేసవిలో ఎండల తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు రోజురోజూ అత్యధికంగా నమోదవుతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. రైతులు నీటిని అవసరాల మేరకే వినియోగించుకోవాలి. వృథా చేయొద్దు, గృహ అవసరాలకు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలి. జిల్లావాసులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉంటేనే వేసవి గట్టెక్కుతుంది. – లావణ్య, ఏడీ, భూగర్భ జలవనరుల శాఖ

# ప్రజాసమస్యలు పరిష్కరించండి

**ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష**



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: గోదావరిఖని బల్దియాలోని 49వ డివిజన్‌లో రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారు.. దీనిని తొలగించాలని స్థానికుడు ప్రసాద్ కోరారు. అదేవిధంగా తన పేరిట కాగజ్‌నగర్‌లో రేషన్‌కార్డు ఉందని, ఆ రేషన్ కార్డును తాను నివాసం ఉండే పెద్దపల్లి జిల్లాలోని కమాన్‌పూర్ ప్రాంతానికి మార్చాలని కల్వల జయ విన్నవించింది. ఇలా.. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలు, గోడును అర్జీల రూపంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు విన్నవించారు. వారి ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్.. సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ వేణుతో కలిసి ప్రజావాణి ద్వారా ఆయన ఫిర్యాదులను స్వీకరించారు.

### భూమిని సవరించాలి



నా భర్త చంద్రయ్య 2015లో చనిపోయాడు. ఆయన పేరిట ఉన్న భూమిని 2018లో నా పేరిట మార్చుకున్నా. 2021లో ఆన్‌లైన్ నుంచి ఎకరం 10 గుంటలను అకారణంగా తొలగించారు. అధికారులను అడిగితే ఎస్సారెస్పీ కాలువ కింద పోయి ఉంటుందని అన్నారు. అవార్డు కాపీ ఇవ్వాలని కోరితే లేదంటున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం తీసుకోలే. ఆన్‌లైన్‌లో భూమిని సవరించాలి.

– సలేంద్ర లక్ష్మి, ముత్తారం

### కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



కరెన్సీ నోట్లు, నాణేలపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి. భారత రాజ్యాంగ రచయిత అంబేడ్కర్ కీర్తి, ప్రతిష్ఠలను ఇనుమడింపజేసేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

– కనుకుంట్ల సదానందం, కొత్తపల్లి

### కులం సర్టిఫికెట్ ఇవ్వడం లేదు



నేను ఎస్టీ కులానికి చెందిన సునితను ఆదర్శ వివాహం చేసుకున్న. మా పిల్లల చదువులకు కుల ధ్రువీకరణపత్రం కావాలని కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న. కానీ, సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. విచారణ జరిపి మాకు కులం సర్టిఫికెట్ ఇప్పించి న్యాయం చేయాలి.

– కల్వల కోమల్, మీర్జంపేట

### రేషన్‌కార్డులో పేరు చేర్చాలి



మాకు రేషన్ కార్డు ఉంది. అందులో నా భార్య అనుప్రియ పేరు చేర్చాలని ఏడాదికిపైగా దరఖాస్తు చేసుకుంటున్న. అయినా, పేరు చేర్చడం లేదు. విచారణ జరిపి రేషన్‌కార్డులో నా భార్య పేరు చేర్చాలి.

– రామయ్య, అనుప్రియ, భూపతిపూర్

### పింఛన్లు మంజూరు చేయాలె



మాది హౌసింగ్‌బోర్డుకాలనీ. వృద్ధాప్య, వితంతు పింఛన్లకోసం దరఖాస్తు చేసుకున్నం. మాకున్న అర్హతలను బట్టి పింఛన్లు మంజూరు చేయాలని అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదు. వీలైనంత త్వరగా పింఛన్లు మంజూరు చేయించి ఆదుకోవాలి.

– మహిళలు, వృద్ధులు, గోదావరిఖని

### దారిని పునరుద్ధరించాలి



పెద్దపల్లి ఆర్డీవో ఆఫీసు మెయిన్ గేట్‌ను ఆనుకుని పాతబజారుకు వెళ్లే దారిని మూసివేసి ఓ గేట్ అమర్చారు. ఈ దారి ఆక్రమణకు గురవుతోంది. పాతబజారుకు వెళ్లే మెయిన్ రోడ్డు రద్దీగా మారింది. పాత రోడ్డును పునరుద్ధరించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి.

– జాపతి రాజేశ్, చందపల్లి

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం ముప్పు తెచ్చేలా పాలిస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. జైభీమ్.. జై బాపు.. జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు ఐతరాజుపల్లె నుంచి భూపతిపూర్ వరకు పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ కుట్రలను ప్రజలకు వివరించేందుకే పాదయాత్ర చేపట్టామని తెలిపారు. నాయకులు అన్నయ్యగౌడ్, ఈర్ల స్వరూప, ప్రకాశ్‌రావు, తిరుపతిరెడ్డి, గండు సంజీవ్, సారయ్యగౌడ్, చిలుక సతీశ్ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే విజయరమణారావు రేగడిమద్దికుంట, అల్లిపూర్ గ్రామాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి మాట్లాడారు.

**క్రికెట్ పోటీల విజేత పోలీస్ జట్టు**

పెద్దపల్లిరూరల్: ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో చేపట్టిన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఫైనల్ పోటీల్లో పోలీసు జట్టుతో వెటర్నరీ డాక్టర్స్ జట్టు తలపడగా.. పోలీసు జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతకు ట్రోఫీతో పాటు రూ.50వేల నగదును ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాపా.. హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రామగుండం: 'పాపా.. హాస్టల్‌లో ఏమైనా సమస్యలున్నా.. ఉంటే నా ఫోన్‌నంబరుకు సమాచారం ఇవ్వండి.. నేనే హాస్టల్‌కు వచ్చి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తా.. మీరు బుద్ధిగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలి' అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. పరిసరాలు, విద్యాబోధన తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. తానున్నానని భరోసా కల్పించారు.

**గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ**

అంతర్గాం మండలం ముర్మూర్, మొగల్‌పహాడ్ గ్రామాల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సన్నబియ్యం పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి రవీందర్‌పటేల్, ఆర్ఐ శ్రీమాన్, కాంగ్రెస్ ప్రతినిధులు సంగణవేణ శేఖర్, సుంకరి రవి, మేకల స్వామి, నాజియా సుల్తానా, చిలుక రామ్మూర్తి పాల్గొన్నారు.

**కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు**

గోదావరిఖని: లింగాపూర్ గ్రామాన్ని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని ఆ గ్రామస్తులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు.

## 27న ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవాలు

గోదావరిఖని: ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం కోసం కేసీఆర్ అహర్నిశలు శ్రమించారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమపార్టీగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. అలాగే ఈనెల 9న స్థానిక లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. నాయకులు కల్వచర్ల కృష్ణవేణి, మెతుకు దేవరాజు, కుమ్మరి శ్రీనివాస్, మారుతి, గాదెం విజయ, గోపు ఐలయ్యయాదవ్, సంధ్యారెడ్డి, పద్మగౌడ్, రవీందర్ లక్ష్మి ఉన్నారు.

# గ్యాస్ గుది'బండ'!

- రూ.50 పెంపుతో రూ.925కు చేరిన సిలిండర్
- పాత జిల్లాలో 10 లక్షలకుపైగా వినియోగదారులు
- ప్రజలపై రూ.5 కోట్లకుపైగా భారం




సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

మరోసారి వంటగ్యాస్ ధరలు పెరిగాయి. సోమవారం గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు ఏప్రిల్ 8 (మంగళవారం) నుంచి అమలులోకి వస్తాయి. దీంతో ప్రస్తుతం రూ.875గా ఉన్న సిలిండర్ ధర సవరించిన ధర రూ.50లతో కలిపి రూ.925కు చేరింది. ప్రస్తుతం రూ.503గా ఉన్న ఉజ్వల్ సిలిండర్‌కు కూడా పెంపు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. దీంతో ఉజ్వల్ సిలిండర్ రూ.553కు చేరుకోనుంది. అంతర్జాతీయ కారణాలతో ధరలు పెరిగాయని చెబుతున్నా.. పండుగపూట మాత్రం సామాన్యునికి ఇది భారమే కానుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 లక్షలకుపైగా ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సవరించిన సిలిండర్ ధరల ప్రకారం.. ఉమ్మడి జిల్లాపై ఏకంగా రూ.5 కోట్లకుపైగా భారం పడనుంది. అదే సమయంలో పెట్రోల్, డీజిల్‌పైనా రూ.2 ఎక్సైజ్ డ్యూటీ పెంచినా.. ఆ పెరుగుదల రిటైల్ ధరలో కలవదని, కాబట్టి వినియోగదారులపై రూ.2 భారం ఉండదని అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో చివరిసారిగా గ్యాస్ ధరలు పెరిగాయి.

# మూలన పడిన 'రోటీ మేకింగ్'

- రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి.. వదిలేసిన సింగరేణి యాజమాన్యం
- అల్పాహారంగా చపాతీ ఇవ్వాలని కార్మికుల డిమాండ్



గ్యాస్‌తో పనిచేసే రోటీమేకర్ యంత్రం

గోదావరిఖని: సింగరేణి క్యాంటీన్లలో కార్మికులకు చపాతీలను అల్పాహారంగా అందించాలని గతంలో యాజమాన్యం నిర్ణయించింది. దీనికోసం గ్యాస్‌తో నడిచే రోటీమేకింగ్ మిషన్లు కొనుగోలు చేసింది. కొంతకాలంపాటు సజావుగా సాగిన ఈప్రక్రియ.. తర్వాత ఏమైందో ఏమోగానీ.. మిషన్లను మూలనపడేశారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు పనిచేయకుండా పోవడంపై సింగరేణి కార్మికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతీ గనిపై క్యాంటీన్..**

సింగరేణిలోని 11ఏరియాల్లో సుమారు 40వేల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతీగని, ఓసీపీ, డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు తక్కువ ధరకే అల్పాహారం అందిస్తున్నారు. ప్రస్తుతం ఉప్మా, ఇడ్లీ, వడ, పూరీ, మసాలావడ అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు నూనెతక్కువగా వినియోగించే చపాతీలనూ అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం గ్యాస్‌తో నడిచే చపాతీ యంత్రాలను 2018లో కొనుగోలు చేశారు. కొద్దిరోజులపాటు వాటిని చపాతీల తయారీకి వినియోగించారు. ఆ తర్వాత యంత్రాల్లో లోపాలు తలెత్తాయి. రొట్టెలు సరిగా కాలకపోవడం, చపాతీలు సరిగా తయారు కాకపోవడంతో మరమ్మతులు చేయించాల్సిన అధికారులు.. వాటిని పక్కనపడేశారు. దీంతో క్యాంటీన్లలో చపాతీల తయారీ నిలిచిపోయింది.

### ప్రతీ క్యాంటీన్‌లో ఏర్పాటు చేయాలి



మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లలో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో నూనె తక్కువగా ఉపయోగించే అల్పాహారం వైపు కార్మికులు మొగ్గుచూపుతున్నారు. యాజమాన్యం చపాతీల యంత్రాలను ప్రతీక్యాంటీన్‌లో ఏర్పాటు చేయాలి. కార్మికులకు మిల్లెట్స్ ఉప్మా, మిల్లెట్స్ ఇడ్లీ, రాగి ఇడ్లీ.. ఇలా కొత్తతరహా అల్పాహారం అందించాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

### వినియోగంలోకి తీసుకొస్తాం



చపాతీలు తయారు చేసే యంత్రాలను సింగరేణి యాజమాన్యం గతంలో కొనుగోలు చేసిన మాట వాస్తవమే. యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని వినియోగించడం లేదు. ఇటీవల గుర్తింపు కార్మిక సంఘం నాయకులు ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. సాధ్యమైనంత త్వరగా వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం. కార్మికులకు చపాతీలతో కూడిన అల్పాహారం అందిస్తాం.

– లలిత్‌కుమార్, ఆర్జీ–1 జీఎం

## క్లుప్తంగా

### అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


అలీ అహ్మద్ మృతదేహం

**ధర్మపురి:** ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఓ వ్యక్తి రాయపట్నం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన మహ్మద్ అలీ అహ్మద్(45) కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, ఆదివారం ఇంటి నుంచి బయటికొచ్చాడు. ధర్మపురి మండలం రాయపట్నం చేరుకుని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు హసామ్ అహ్మద్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఉరేసుకుని ఒకరు..

**జగిత్యాలక్రైం:** జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన అనుసూరి శ్యామ్‌సుందర్(46) సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్యామ్‌సుందర్‌కు అతని సోదరునికి మధ్య కొద్దికాలంగా భూ వివాదం కొనసాగుతోంది. భూపత్రాలు ఇవ్వడం లేదనే మనస్తాపంతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

### దుబాయ్‌లో అయిలాపూర్ వాసి మృతి


గాజర్ల శ్రీనివాస్ (ఫైల్)

**కోరుట్ల రూరల్:** మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గాజర్ల శ్రీనివాస్(55) దుబాయ్‌లో ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ గత 10ఏళ్లుగా జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి వస్తున్నాడు. రెండేళ్ల క్రితం సెలవుపై వచ్చి వెళ్లాడు. ఆదివారం ఉదయం తను ఉండే గదిలోనే గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య జల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురు లాస్యకు వివాహం కాగా చిన్న కూతురు రమ్య డిగ్రీ పూర్తి చేసింది, కుమారుడు రణధీర్ ఎంసీఏ చదివాడు. ఇంటి పెద్ద మృతి చెందటంతో శ్రీనివాస్ మృతదేహం కోసం ఎదురుచూస్తూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..

**మెట్‌పల్లి:** పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 5న స్థానిక పాత నటరాజ్ థియేటర్ సమీపంలో సుమారు 25ఏళ్ల యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారమందుకున్న 108 సిబ్బంది అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. అప్పటి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో ఉంచగా, అతని సంబంధీకులు ఎవరు రాలేదు. దీంతో మృతదేహాన్ని దహన సంస్కారాల నిమిత్తం సోమవారం మున్సిపల్ సిబ్బందికి అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### స్తంభంపల్లిలో ఒకరు..

**వెల్గటూర్ :** వెల్గటూర్ మండలం స్తంభంపల్లికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల రమేశ్(41)గత పదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య వనిత ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

### రైలు నుంచి పడి వివాహిత..


ప్రతిభ రమేశ్‌గజ్ (ఫైల్)

**జమ్మికుంట(హుజూరాబాద్):** ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి వివాహిత మృతిచెందింది. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని రాజురా పట్టణానికి చెందిన వివాహిత ప్రతిభ రమేశ్‌గజ్ (46) వైద్యం కోసం కూతురు, సోదరుడితో కలిసి బల్హార్షా నుంచి సికింద్రాబాద్‌కు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. ఈ క్రమంలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త రమేశ్‌కోండ్‌గజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### నిరుద్యోగ మహిళలు, యువతులకు ఈ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ

**చిగురుమామిడి:** చిగురుమామిడి మండలంలోని నిరుద్యోగ యువతులు, మహిళలకు ఈ–ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ సోమవారం తెలిపారు. 18 నుంచి 45ఏళ్ల వయస్సున్న వారికి 60 రోజులపాటు ఎల్ఎండీకాలనీలోని దుర్గాబాయి మహిళా, శిశువికాస ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 50మంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన యువతులకు ఎలక్ట్రిక్ ఆటో నడపడంలో శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్సు జారీ చేస్తామన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# పరుగెత్తితే పతకమే..

- క్రీడా పోటీల్లో 'మోడల్' విద్యార్థుల సత్తా
- రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న చిన్నారులు
- అభినందిస్తున్న క్రీడాభిమానులు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష(ఫైల్)

**ధర్మారం(ధర్మపురి):** వాళ్లు పల్లెవాసులు.. క్రీడా నేపథ్యం లేని కుటుంబాల నుంచి వచ్చారు.. ఎక్కడా తర్ఫీదు కూడా తీసుకోలేదు.. కానీ, చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తూ ఔరా అనిపిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు ధర్మారం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు. పీఈటీ కొమురయ్య, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ప్రోత్సాహంతో మెలకువలు నేర్చుకుంటున్నారు. ఈ విద్యాలయం నుంచి ఏటా 40 నుంచి 50 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి, ఐదుగురు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. 2024–25 సంవత్సరంలో జాతీయస్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు హాజరవుతున్నారు. ఈ విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన క్రీడాకారులతో తలపడి అద్భుత రికార్డులో నమోదు చేస్తున్నారు. వివిధ పట్టణాలు, నగరాల్లో నిర్వహించే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు సొంత ఖర్చులతోనే వెళ్తూ పతకాలు సాధిస్తున్నారు.

#### వాలీబాల్‌లో సత్తా



ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న సింధూ అండర్–19 వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ విజయవాడలో నిర్వహించిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటింది.

– బి.సింధూ

#### పట్టుదలతోనే



ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న శరణ్య రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్–19లో మణిపూర్ రాష్ట్రంలోని ఇంపాలో ఈనెల 15 నుంచి 21 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

– బైకని శరణ్య

#### ఆనందంగా ఉంది



తొమ్మిదో తరగతి చదువుతున్న మనోజ్ఞ ఎస్‌జీఎఫ్ అండర్ –17లో ఇటీవల మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటడం ఆనందంగా ఉంది.

– తుమ్మల మనోజ్ఞ

#### పట్టుదలతోనే సాధ్యం



పీఈటీ ప్రోత్సాహంతో సాఫ్ట్‌బాల్‌పై ఆసక్తి పెంచుకున్న. పట్టుదలతో ఆడుతూ రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీలకు చేరుకున్న. మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాణించడం సంతోషంగా ఉంది.

– బండి వైష్ణవి

#### జాతీయ స్థాయిలో ప్రతిభ



ఎనిమిదో తరగతి చదువుతున్న ఓరం సౌజ్ఞ అథ్లెటిక్స్ అండర్ –14లో జాతీయ స్థాయికి ఎదిగింది. ఆమె పరుగెత్తుతే పతకం ఖాయం. రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగి గుజరాత్ హమ్మదాబాద్‌లో జరిగిన పోటీల్లో సత్తా చాటింది.

– ఓరం సౌజ్ఞ

## హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

**జగిత్యాలజోన్:** ముగ్గురు పిల్లలున్న వివాహితపై కన్నేసి, మాట వినకుంటే కిరోసిన్ పోసి నిప్పంటించి, ఆమె మృతికి కారణమైన నిందితుడు ఇల్లంతకుంట శ్రీధర్‌కు యావజ్జీవ శిక్ష, రూ 1.02 లక్షల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. పీపీ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం కొడిమ్యాలలో నివాసం ఉండే దంపతులకు ముగ్గురు పిల్లలు. భర్త ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. భార్య బీడీలు చుడుతూ పిల్లలను చదివిస్తోంది. వీరి ఇంటి పక్కన ఉండే ఇల్లంతకుంట శ్రీధర్ సదరు మహిళపై కన్నేశాడు. కోరిక తీర్చకపోతే చంపుతానని బెదిరించాడు. దీంతో సదరు మహిళ తన పిల్లలతో కలిసి అదే గ్రామంలో వేరే చోటుకు అద్దె ఇంట్లోకి మారింది. అక్కడికి వెళ్లిన శ్రీధర్ మహిళకు ఇల్లు ఎందుకు అద్దెకిచ్చావని యాజమానితో గొడవకు దిగాడు. దీంతో ఆ మహిళ తిరిగి సొంతింటికి వచ్చింది. ఏప్రిల్ 14, 2019 రోజున సదరు మహిళ ఇంట్లో బీడీలు చుడుతుండగా, శ్రీధర్ వచ్చి తన కోరిక తీర్చమని వేదించాడు. ఒప్పుకోకపోవడంతో తన ఇంట్లోంచి కిరోసిన్ తీసుకొచ్చి ఆమెపై పోసి నిప్పంటించాడు. ఈ సమయంలో మహిళ పిల్లలు గ్రామంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని తిరిగి వస్తుండగా, ఇంట్లోంచి కేకలు వినపడ్డాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పివేస్తుండగా శ్రీధర్ అక్కడి నుంచి పారిపోయాడు. సదరు మహిళను జగిత్యాలకు తరలించి, అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ అసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐలు సీహెచ్.నాగేందర్, కె.కిశోర్ కేసు నమోదు చేసి, శ్రీధర్‌ను అరెస్ట్ చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కేవీ.సాగర్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో, పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడైన ఇల్లంతకుంట శ్రీధర్‌కు యావజ్జీవ శిక్షతో పాటు రూ.1.02 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

### ద్విచక్రవాహనం దహనం


కాలిపోయిన ద్విచక్రవాహనం

**కోరుట్ల రూరల్:** మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఓ యువకుడు తన తాతకు చెందిన ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టాడు. ఈ ఘటనలో బైక్ పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే మరిపెల్లి లింబయ్య ఆదివారం తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట నిలిపి, ఇంట్లో నిద్రించాడు. తన మనవడు మరిపెల్లి లింబాద్రి రాత్రి 10గంటల ప్రాంతంలో మద్యం సేవించి వచ్చి, ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఇంట్లో నిద్రిస్తున్న లింబయ్య బయటకు వచ్చే సరికే బైక్ పూర్తిగా కాలిపోయింది. లింబయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ద్విచక్రవాహనం చోరీ

**జగిత్యాలక్రైం:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామానికి చెందిన గంగిపెల్లి నాగరాజు ఈనెల 1న కొత్తబస్టాండ్‌లో బైక్ నిలిపి కళాశాలకు వెళ్లి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని దొంగలు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

## విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

**హన్మకొండ:** వాతావరణ శాఖ ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. సోమవారం హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంనుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ ఏదైనా అంతరాయం జరిగితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడితే, ట్రిపింగ్స్, బ్రేడౌన్‌లు సంభవిస్తే త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల కోతలు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సమయంలో కావాల్సిన మెటీరియల్‌ను సమకూర్చుతామన్నారు. వ్యవసాయానికి అవసరమైన చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి సర్కిల్‌లో ఎల్‌సీ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ టి.సదర్‌లాల్, జీఎంలు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



## రాజన్నా శరణు.. శరణు

**వేములవాడ:** రాజన్నను సోమవారం 40వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. కల్యాణోత్సవం విజయవంతం కావడంతో ఆలయ ఉద్యోగులు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డిని శాలువా కప్పి సత్కరించారు. ఏఈవోలు అశోక్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.




# దుబాయ్‌లో మూడో వ్యక్తి ?

- బంగారం సంఘటనలో మరో ట్విస్ట్
- ఆందోళనలో బాధిత కుటుంబం

**చందుర్తి(వేములవాడ):** విదేశీ బంగారంను మాయం చేసిన కేసులో నిందితుడుగా భావిస్తున్న చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన ఏనుగుల నాగరాజు ఉరఫ్ నాని పోలీసుల కళ్లుగప్పి దుబాయ్ పరారైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన తుంటి భీరయ్య, గడ్డం అనిల్ సౌదీ అరేబియా నుంచి 400 గ్రాముల బంగారంను ఇండియాకు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో ఫ్లైట్ దిగిన తర్వాత సమీప బంధువు చేతిలో మోసపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా భావిస్తున్న వెంకటేశ్ సౌదీలో ఉండగా.. పరారీలో ఉన్న నాగరాజు కోసం పోలీసులు రెండు బృందాలుగా వీడిపోయి గాలిస్తున్నారు. కాగా అతను గల్ఫ్ వెళ్లినట్లు ప్రచారంలో ఉంది.

**భయాందోళనలో బాధిత కుటుంబాలు**

సౌదీ అరేబియా నుంచి ఒప్పందం ప్రకారం బంగారం తీసుకొచ్చిన భీరయ్య, అనిల్ మూడో వ్యక్తి చేతిలో మోసపోయారు. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 5న రిమాండ్‌కు తరలించారు. భీరయ్య, అనిల్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఇంటికొచ్చారు. కాగా సౌదీ అరేబియా నుంచి బంగారం పంపించిన వారి నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని భీరయ్య తండ్రి కంటితడి పెడుతున్నాడు. జైలులో ఉంటేనే తమ వారు క్షేమంగా ఉంటారనే భావన బాధిత కుటుంబ సభ్యులు భావిస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. కాంట్రాక్ట్‌పై బంగారంను ఎయిర్‌పోర్టులో అధికారుల కన్నుగప్పి బయటకు తీసుకొచ్చిన తర్వాత తెలిసిన వ్యక్తి చేతిలో మోసపోవడం కొసమెరుపు. కాగా సదరు మూడో వ్యక్తి దుబాయ్ చెక్కేశాడనే చర్చ స్థానికంగా జోరందుకుంది.

## రూ.10లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం

- ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాటం
- గాయపడ్డ యువకుడి మృతి
- నారాయణపూర్‌లో విషాదం


అవేజ్ (ఫైల్)


అవేజ్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు ఎనిమిది రోజులు మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. యువకుడి ప్రాణాలు కాపాడుకోవడానికి తల్లిదండ్రులు రూ.10లక్షలు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కలేదు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో విషాదం నింపింది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. నారాయణపూర్‌కు చెందిన షేక్ అవేజ్(18) గత నెల 30న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఆదివారం రాత్రి మృతి చెందాడు. రంజాన్ పండుగకు ముందు రోజు సిరిసిల్లలోని ఓ టైలర్‌లో కుట్టించిన కొత్త బట్టలు తీసుకురావడానికి తన మిత్రుడు షేక్ అఫ్రోజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అవేజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఏడు రోజులపాటు చికిత్స అందించారు. ఒక్కగానొక్క కొడుకును కాపాడుకోవడానికి తల్లిదండ్రులు అప్పు చేసి వైద్యం అందించారు. అయినా ప్రాణాలు దక్కకపోవడంతో తండ్రి సమద్, తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గాయపడ్డ మరో యువకుడు అఫ్రోజ్ చికిత్స పొందుతున్నాడు. మృతుని కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి తదితరులు పరామర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తల్లీకొడుకుల మృతితో రుద్రంగిలో ఉద్రిక్తం


ఇంటివద్ద మోహరించిన పోలీసులు


ఆందోళనకారులను సముదాయిస్తున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్

- అనుమానితుల ఇంటిపై మృతురాలి కుటుంబీకుల దాడి
- సముదాయించిన పోలీసులు

**రుద్రంగి(వేములవాడ):** రుద్రంగికి చెందిన తల్లీకొడుకులు కాదాసు పుష్పలత, నిహాన్ మృతితో మండల కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అత్తమామలే విషమిచ్చి చంపారంటూ మృతురాలి తల్లిగారి కుటుంబ సభ్యులు పుష్పలత అత్తమామల ఇంటిపై సోమవారం దాడి చేశారు. వారి మృతికి కారకులను శిక్షించాలని కోరుతూ ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ధర్నాకు యత్నించారు. బాధితులకు న్యాయం చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్షిస్తామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు చేపట్టారు. పుష్పలత భర్త దుబాయ్ నుంచి మంగళవారం వస్తుండడంతో అంత్యక్రియలు సోమవారం జరుపలేదు. పుష్పలత మృతదేహాన్ని వేములవాడ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్:** కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి వచ్చిన మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 0878–2268686 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# ప్రమాదాల నియంత్రణ లక్ష్యం

- అందుబాటులోకి వచ్చిన ఎల్‌సీ సేవలు
- ఉద్యోగులకూ పూర్తి భద్రత
- అందరికి తెలిసేలా సమాచారం
- ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరావు




**పెద్దపల్లిరూరల్:** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఆన్‌లైన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎల్‌సీలు తీసుకునే సమయంలో జరిగే పొరపాట్లను ఈ యాప్ ద్వారా నియంత్రించేందుకు వీలు ఉంటుంది. ఓ ఫీడర్‌కు మరో ఫీడర్, పంపిణీ వ్యవస్థను మర్చిపోవడం, సమాచారలోపంతో ఉద్యోగులు ప్రమాదాల బారినపడకుండా ఈ యాప్ దోహదపడుతుంది. ఎల్‌సీ సమాచారం అధికారులు అందరికీ వెంటనే తెలిసిపోతుంది.

**అమలు తీరిది..**

ఎల్‌సీ కావాలనుకునే లైన్‌మెన్ ఈయాప్‌లో తనకు కావాల్సిన ఫీడర్‌లో ఎల్‌సీ కావాలని ఏఈకి విన్నవిస్తారు. దీనిని పరిశీలించి ఇవ్వ వచ్చా, లేదా, అత్యవసరమా? కాదా? అని నిర్ధారించుకుని నిర్ణయం తీసుకుంటారు. ఏఈ అనుమతివ్వగానే లైన్‌మెన్‌కు సమాచారం అందుతుంది. అలాగే సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్ ఇవ్వాలో సమాచారం తెలుస్తుంది. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నింటినీ ఈయాప్ సిబ్బందికి గుర్తుచేసి అప్రమత్తం చేస్తుంది. ఆపరేటర్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. లైన్‌మెన్ వాటిని పరిశీలించి పనికి ఉపక్రమిస్తాడు. లైన్‌మెన్ ఎంతమందితో పనిచేయిస్తున్నాడో వారి వివరాలు నమోదు చేయాలి. ఎల్‌సీ రిటర్న్ సమయంలో ఎర్త్‌రాడ్ తీశారా? ఏబీ స్విచ్చాన్ అయిందా అని అడగడంతో ఎల్‌సీ ప్రక్రియ పూర్తవుతుంది.

**భద్రతా ప్రమాణాలు మరింత పెంచేందుకే..**



విద్యుత్ సిబ్బంది పనులు చేసే సమయంలో పొరపాటున ప్రమాదాల బారిన పడకుండా భద్రతా ప్రమాణాలను పెంచేందుకు ఈ ఎల్‌సీ యాప్‌ను రూపొందించాం. దీనిద్వారా ఎలాంటి పొరపాట్లు జరగకుండా పనులు పక్కాగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుంది. విద్యుత్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తోంది.

– మాధవరావు, ఎస్ఈ, పెద్దపల్లి

## ఓసీపీ-1లో కాంట్రాక్టు కార్మికునికి గాయాలు

**గోదావరిఖని:** సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–1లో అనవేన సంపత్ అనే కాంట్రాక్టు కార్మికునికి సోమవారం గాయాలయ్యాయి. క్వారీలోని సంప్ ఏరియాలో మరమ్మతు చేస్తున్న కే–10షావల్ వద్ద పనిచేస్తున్న సమయంలో ఈప్రమాదం జరిగింది. షావల్ ట్రాక్‌పిన్ బయటకు వచ్చిందని, బీమ్ రొటేట్ చేస్తుక్రమంలో ఐరన్ ముక్క వేగంగా వచ్చి సంపత్ కడుపునకు ఎడమవైపు తగిలి తీవ్ర రక్తస్రావం అయ్యిందని స్థానికులు తెలిపారు. గాయపడిన సంపత్‌కు యైటింక్లయిన్‌కాలనీ డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆపరేషన్ నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.